
క్లుప్తంగా...

గురుస్వామి సతీశ్‌నాయర్ కన్నుమూత


గురుస్వామి సతీశ్ నాయర్

శంషాబాద్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, గురుస్వామి సతీశ్‌నాయర్ స్వామి శనివారం కన్నుమూశారు. మండలంలోని పాలమాకులలో నివాసముండే ఆయన మూడు దశాబ్దాలుగా అయ్యప్పభక్తులకు దీక్షానిర్వహణ చేస్తూ మాలధారణ చేయిస్తున్నారు. ఆయన మృతిచెందడంతో భక్తులు, స్థానికులు సంతాపం వ్యక్తం చేసి శ్రద్ధాంజలి ఘటించారు.

గోడ కూలి పలువురికి గాయాలు

బండ్లగూడ: బిల్డర్ నిర్లక్ష్యం వలన ముగ్గురు గాయాలపాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ పెద్దమ్మగుడి వద్ద ఓ బిల్డర్ ఐదంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నాడు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండానే పెద్ద అంతస్తుపై గోడ పెడుతుండగా అది కూలి పక్కనే ఉన్న రేకుల రూంపై పడింది. దీంతో ఆ రేకులు పగిలిపోయి ఇంట్లో ఉన్న తల్లితండ్రు కుమారులకు గాయాలయ్యాయి. వికారాబాద్ జిల్లా కొడంగల్ ప్రాంతానికి చెందిన అజ్మీర్ (34), రెహానా (28)లు తమ ఇద్దరు కుమారులైన నసీర్ (14), అలీ (8) తో కలిసి ఇక్కడికి వలస వచ్చి కూలీ పని చేస్తూ, ఇక్కల్లో అద్దెకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెహానా తలకు సిటీ స్కాన్ తీయాలని, నసీర్ కాలు పాదం వద్ద ఎముకల్లో క్రాక్ వచ్చిందని వైద్యులు చెప్పినట్లు వారు తెలిపారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఆస్తిపన్ను వసూళ్లు వేగవంతం చేయాలి


రెవెన్యూ విభాగం, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లతో సమావేశమైన డీసీ రవి కుమార్

రాజేంద్రనగర్: ఆస్తి పన్ను వసూళ్లను మరింత వేగవంతం చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్ సూచించారు. రెవెన్యూ విభాగం, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు తమకు కేటాయించిన టార్గెట్‌ను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. మొండి బకాయిదారులకు ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేశామని, స్పందించకపోతే వారి ఆస్తులను సీజ్ చేయాలని సూచించారు.

నూతన ఏసీపీకి సన్మానం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసుగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీనారాయణను అత్తాపూర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, గుర్రంపల్లి యాదగిరి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు.

ఉరేసుకుని నవ వధువు ఆత్మహత్య

అత్తాపూర్: కుటుంబ సభ్యులను వదిలి భర్తతో కలిసి ఒంటరిగా జీవించడం ఇష్టం లేక మనస్తాపానికి గురైన ఓ నవ వధువు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకకు చెందిన చెన్నప్ప సమీప బంధువు నవనీతను వివాహం చేసుకున్నాడు. బతుకుదెరువు కోసం అత్తాపూర్ తేజస్విని కాలనీకి వచ్చారు. చెన్నప్ప కూలీ పనులకు వెళ్లడంగా నవనీత (19) ఇంట్లోనే పని చేస్తూ భర్త సామికి అందగా ఉంటున్నది. కూలీ పనులు ముగించుకొని వచ్చిన చెన్నప్ప ఇంటి డోర్ తీయకపోవడంతో స్థానికుల సహాయంతో తలుపులు తొలగించి లోనికి వెళ్లారు. అప్పటికే నవనీత ఉరేసుకుని మృతి చెందింది. చెన్నప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పరపల్లిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఏకాదశి, 11వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ వ్యవస్థాపకుడు, ధర్మకర్త సామ యమునా భూపాల్ రెడ్డి ఈ నెల 16న ఉదయం సుప్రభాత సేవ, విష్వక్సేన పూజ, స్వామి వారికి అభిషేకం, నీరాజన మంత్రపుష్పం, సాయంత్రం 6 గంటలకు ఋత్విక్‌రణం, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం తదితర పూజ కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం అర్చన, సహస్రనామార్చన, ఎదుర్కోలు ఉత్సవం, శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం, అన్నదానం, స్వామి వారి ఉత్సవ మూర్తుల ఊరేగింపు తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'వారాంతపు సంత'లకు
ఆదరణ

- అందుబాటులో నిత్యావసరాలు
- అటు వ్యాపారులకు ఉపాధి.. ఇటు వినియోగదారులకు సౌకర్యం



కూరగాయల సంతలో క్రయ విక్రయాలు



అత్తాపూర్: 'వారాంతపు సంతలు' అనగానే మనకు కొన్నేళ్ల గుర్తొచ్చేవి పల్లెలే. అయితే హైదరాబాద్ లాంటి మహానగరంలోనూ క్రమంగా వాటికి ఆదరణ పెరుగుతున్నది. ఎందరో చిరు వ్యాపారులు వారంలో ఒక రోజు ఒక్కో ప్రాంతంలో ఏర్పాటు చేసిన సంతలో తాజా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, ఉల్లి, వెల్లుల్లి తదితర నిత్యావసర వస్తువులను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. స్థానికంగానే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్న వాటిని కూడా సేకరించి



వినియోగదారులకు అందిస్తున్నారు. ఇక్కడి వ్యాపారాన్ని గుర్తించిన స్థానికులే కాకుండా తెలంగాణ సరిహద్దు ప్రాంతాలు, సుదూర రాష్ట్రాల నుంచి కూడా హైదరాబాద్ మహానగరానికి వలస వస్తున్నారు. ముఖ్యంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి, ఉడంగడ్డ, లక్ష్మీగూడ, బాబుల్‌రెడ్డినగర్, మార్కెండేయనగర్, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్, చింతల్‌మెట్, ఉప్పర్‌పల్లి, హైదర్‌గూడ జనప్రియ, యూనోప్రియ, వేంకటేశ్వర ఆలయ ప్రాంతం, అత్తాపూర్, రాజేంద్రనగర్ డెయిరీ ఫాం చౌరస్తాల్లో వారంలో ప్రతిరోజు ఒక ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని చిరు వ్యాపారులు నిత్యావసరాలు విక్రయిస్తున్నారు. వీటికి స్థానికుల నుంచి మంచి ఆదరణ ఉంటున్నది. అయితే కొన్ని ప్రాంతాల్లో చిరువ్యాపారులపై కొందరు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, జీహెచ్ఎంసీ అధికారులు మార్కెట్ వ్యవస్థ పటిష్ఠ రుపై దృష్టి సారిస్తే ఇటు వినియోగదారులకు.. అటు వ్యాపారులకు కూడా లాభదాయకంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

పదేళ్లుగా ఆకుకూరలే విక్రయిస్తున్నాను..



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇక్కడ మార్కెట్ వ్యవస్థ బాగుందని తెలిసింది. దీంతో మహారాష్ట్ర నుంచి కుటుంబ సభ్యులతో కలిసి ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చాను. పదేళ్లుగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న మార్కెట్ సెంటర్లలో కేవలం ఆకుకూరలు మాత్రమే విక్రయిస్తున్నాను. కేవలం రూ. 1,000 లతో ప్రారంభించిన వ్యాపారం ప్రస్తుతం రూ. 15 వేలకు చేరింది. రోజుకు సగటున రూ.2 వేల సంపాదిస్తాను. ముగ్గురు అమ్మాయిల పెళ్లిలు చేసి కుటుంబ సభ్యులతో ఇప్పుడు ప్రశాంతంగా జీవనం గడుపుతున్నాను.

– ఎండీ మోహినొద్దీన్, మహారాష్ట్ర వాసి

తాజా కూరగాయలు దొరుకుతున్నాయి..

నగరంలో తాజా కూరగాయలు ఎప్పటికప్పుడు అందుబాటులోకి రావడంతో ఇక ఫ్రిజ్‌లో పని లేకుండా పోయింది. రోజువారీగా ఉద్యోగులు, గృహిణులు కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. ధరలు కూడా అందుబాటులోనే ఉంటున్నాయి. వారం రోజులకు సరిపడా కూరగాయలు కొనుగోలు చేసి ఫ్రిజ్‌లో దాచుకొని తినే రోజులు పోయాయి.

– స్వప్న, ఉపాధ్యాయురాలు, అత్తాపూర్

ఎంతో మందికి ఉపాధి ..



హైదరాబాద్ దేశంలోనే వివిధ ప్రాంతాల వారికి బతుకుదెరువును ఇచ్చే విశ్వ నగరంగా మారింది. కరోనా సమయంలో వలసలుగా వెళ్లిన వారంతా రెట్టింపు ఉత్సాహంతో తిరిగి భాగ్యనగరానికి చేరుకున్నారు. విశాల హృదయం గల తెలంగాణ ప్రజలు, సంస్కృతి ఎల్లలు దాటుతున్నది. అత్తాపూర్ హైదర్‌గూడ జనప్రియ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారులకు అండగా ఉంటున్నాం.

– రాచూరి రాజశేఖర్, అత్తాపూర్

మున్సిపల్ కమిషనర్లకు శుభాకాంక్షలు

మణికొండ: కొత్తగా వచ్చిన నార్సింగి, మణికొండ మున్సిపల్ కమిషనర్లు టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డి. ప్రదీప్‌కుమార్‌ను పలు కాలనీల సంక్షేమ సంఘాలు, కౌన్సిలర్లు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నార్సింగిలో ఆరో వార్డు కౌన్సిలర్ పి. శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో ప్రజలు, అలాగే మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా అలకాపూర్ టౌన్‌షిప్‌లో ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.


మణికొండ కమిషనర్ ప్రదీప్‌రావును సన్మానిస్తున్న అలకాపూర్ టౌన్‌షిప్ సభ్యులు


నార్సింగి కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న కౌన్సిలర్ శ్రీకాంత్‌రావు

వైభవంగా వార్షికోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం శ్రీ శారదాధామం వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన వక్తగా విద్యా భారతి దక్షిణ మధ్యక్షేత్ర అధ్యక్షుడు చామర్తి ఉమామహేశ్వరరావు హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలల్లో చదివిన అనేక మంది విద్యార్థులు అంకితభావంతో విద్యారంగంలో సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో శిశు మందిర పూర్వ విద్యార్థి, ఏసీపీ గిరిధర్, శ్రీ సరస్వతి విద్యాపీఠం భాగ్యనగర్ విభాగ్ కార్యదర్శి విరివింటి దేవేంద్ర శర్మ, విద్యా భారతి దక్షిణ మధ్యక్షేత్ర కోశాధికారి పసర్తి మల్లయ్య, ఆవాస విద్యాలయం అధ్యక్షుడు గోకరి అర్జున్‌గౌడ్ పాల్గొన్నారు.


వార్షికోత్సవంలో ప్రదర్శనలు నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు

- జిల్లా విద్యాధికారి సుశీందర్
- పదోతరగతి విద్యార్థులకు అవగాహన

శంషాబాద్: ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాధికారి సుశీందర్ సూచించారు. పెద్దషాపూర్‌లోని ఎస్‌టీఆర్ ఫంక్షన్ హాల్‌లో రాజేంద్రనగర్, శంషాబాద్, గండిపేట మండలాలలోని పదో తరగతి విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలంటే విద్యార్థులు భయపడవద్దన్నారు. మానసిక ఒత్తిడి కలిగేలా తల్లిదండ్రులు, స్నేహితులు చూడాలన్నారు. అలాగే సైకాలజిస్టులతో పలు సూచనలు చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాంరెడ్డి, ఎంపీపీ జయమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధినిచ్చే స్థాయికి ఎదగాలి


వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు, మహవీర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ సందెడ్డి సురేందర్ రెడ్డి

అత్తాపూర్: విద్యార్థులు ఉద్యోగిగా మిగిలిపోకుండా పది మందికి ఉపాధినిచ్చే స్థాయికి ఎదగాలని మహవీర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ సందెడ్డి సురేందర్ రెడ్డి సూచించారు. బండ్లగూడలోని కళాశాలలో ఇన్‌స్టిట్యూషన్ కౌన్సిల్, సివిల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'సంస్థ స్థాపనకు కావాల్సిన నైపుణ్యం, ప్రవర్తన వైఖరి' అనే అంశంపై శనివారం నిర్వహించిన వర్క్‌షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పాలసీకి అనుగుణంగా స్టార్టప్ సెంటర్ల ఏర్పాటుకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. విద్యార్థులు జీవితంలో పడుతున్న సవాళ్లను తమ ప్రతిభ ద్వారా అధిగమించాలన్నారు. కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు కావాల్సిన మెళకువలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నికా కుమారి, కళాశాల సంయుక్త కార్యదర్శి సందెడ్డి ధనుంజయ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ, సివిల్ హెచ్‌ఓడీ డాక్టర్ శ్వేతాంబర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఎస్.వి.రంగ్రాకర్, ఐఈసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ వి.వి.ప్రతిభా భారతి, డాక్టర్ నయీమ్ శ్రీజా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు కేక్ తినిపిస్తున్న కార్యకర్తలు

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్‌గౌడ్ తన నివాసంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు తినిపించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ గత పదేళ్లలో దేశంలో ఎక్కడా లేని పథకాలు ప్రవేశపెట్టి ఎంతోమంది లబ్ధిదారులకు అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు బాధపడక తప్పదని, మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు టి ప్రేమ్‌గౌడ్, ఛాయాదేవి, లక్ష్మీరాజ్, రాజేశ్ ఉన్నారు.


వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: పట్టణంలో మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను బీఆర్ఎస్ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు దూడల వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ సుష్మ, కౌన్సిలర్లు అజయ్, మేకల వెంకటేశ్, అమృత, ముక్కురి శ్రీకాంత్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు దీప, శ్రీకాంత్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, తాజ్‌బాబా, ప్రసాద్, మంచర్ల శ్రీనివాస్, ప్రభాకర్, జ్ఞానేశ్వర్, కృష్ణ, పవన్‌గౌడ్, నరేందర్, సంతోష్, రాజు పాల్గొన్నారు.

బండ్లగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడి ఆధ్వర్యంలో..


బండ్లగూడలో కేక్‌కట్ చేస్తున్న గోకరి సురేశ్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు గోకరి సురేశ్‌గౌడ్ తన కార్యాలయంలో కేక్ చేశారు. కార్యక్రమంలో కిస్మత్‌పూర్ గ్రామ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజునాయక్, ప్రదీప్‌గౌడ్, గణేశ్‌యాదవ్, భాస్కర్‌గౌడ్, సాయి, సందీప్, గౌతమ్ పాల్గొన్నారు.

రంగారెడ్డి డీటీఓ బాధ్యతల స్వీకరణ



మణికొండ: రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారిగా చంద్రశేఖర్‌గౌడ్ మణికొండలోని తన కార్యాలయంలో శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయనకు కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీరామ్ స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేసిన ప్రవీణ్‌రావును ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. అలాగే ప్రవీణ్‌రావును సిబ్బంది, అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. నూతన డీటీఓ చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.



'విద్యాసంస్థ గుర్తింపు రద్దు చేయాలి'



శంషాబాద్: బాలికపై లైంగిక దాడి చేసిన కీచక అధ్యాపకుడు పనిచేస్తున్న 'కృష్ణ ప్రదీప్ అకాడమీ' గుర్తింపును రద్దు చేయాలని ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. రాళ్లగూడ రహదారిలోని అకాడమీ వద్ద శంషాబాద్ జిల్లా కన్వీనర్ దాసరి మహేశ్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకుడితో పాటు మంచి నడవడిక లేని వారిని అధ్యాపకులుగా తీసుకొని విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాలికకు న్యాయం చేయడంతో పాటు కీచక అధ్యాపకుడిని కఠినంగా శిక్షించాలన్నారు. ధర్నా చేస్తున్న ఏబీవీపీ నేతలను ఆర్జీఐఏ పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రదీప్, చందు, అఖిల్, చరణ్, తిరుపతి, పవన్, శివ, అఖిల్, తరుణ్, భారత్, నవీన్, సురేశ్, విజయ్, దినేశ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆందోళన

శంషాబాద్: పట్టణంలోని రాళ్లగూడలో గల కృష్ణప్రదీప్ ఐఏఎస్ అకాడమీ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు ప్రణయ్ మాట్లాడుతూ బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని, కీచక అధ్యాపకుడిని కఠినంగా శిక్షించాలని, అలాగే విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మణికొండలో అగ్నిప్రమాదం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని క్వార్టర్స్‌లో ప్రసాద్ అనే దిన పత్రిక వాచ్‌మన్ నివాసం తయారీ చేస్తున్నారు. శనివారం సాయంత్రం అందులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు మంటలార్పేందుకు యత్నించగా అదుపులోకి రాలేదు. దీంతో వారు అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. సుమారు రూ. 2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

రాజేంద్రనగర్ బీజేపీ నాయకుల సమావేశం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పొన్నామోని మల్లేశ్ యాదవ్ అధ్యక్షతన ఉప్పర్‌పల్లిలోని సామ భూపాల్ రెడ్డి గార్డెన్‌లో రాజేంద్రనగర్ అసెంబ్లీ కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ నెల 20 న చేవెళ్ల పార్లమెంట్ బస్సు యాత్ర తాండూర్ పరిగి, చేవెళ్ల మీదుగా 22న రాజేంద్రనగర్‌కు రానున్న సందర్భంగా యాత్రను విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల పార్లమెంట్ ప్రభారి విష్ణువర్ధన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ప్రేమ్ రాజ్ పాల్గొన్నారు. యాత్రలో బూత్‌స్థాయి కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని.. అలాగే ప్రజలను భాగస్వాములుగా చేసి పార్టీ వైపు ఆ యాత్రలో యువ మోర్చా నాయకులు బైక్ ర్యాలీ నిర్వహిస్తూ రోడ్ షోలో ప్రత్యేక ఆకర్షణగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లా రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బొక్క బాల్‌రెడ్డి, కోకాని నర్సల్ లింగం గౌడ్, కార్పొరేటర్ సంగీత, డి.లక్ష్మీనారాయణ, సత్యనారాయణ ముదిరాజ్, విజయ కుమార్, బీరప్ప, మహేశ్ యాదవ్, నిఖిల్, కె.దేవేందర్, వీణా సేవక్, జోగి, రవి, సోలార్ రెడ్డి పాల్గొన్నారు.

చెస్‌లో రాణించడం అభినందనీయం



అత్తాపూర్: తమ పాఠశాల విద్యార్థిని శివాశిక 12 ఏళ్ల వయస్సులోనే రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం అభినందనీయమని అత్తాపూర్ జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, మాస్టర్ చెస్ అకాడమీ అత్తాపూర్ కోచ్ అమిత్ పాల్ సింగ్ అన్నారు. ఢిల్లీలో వారం రోజులుగా జరుగుతున్న చెస్ పోటీల్లో వివిధ కేటగిరిల్లో శివాశిక పాల్గొంది. శనివారం జరిగిన నేషనల్ ఉమెన్ ఛాంపియన్ ఉమెన్ టీంలో 2300 చెస్ ఛాంపియన్‌షిప్–2024లో మూడో ప్రైజును సొంతం చేసుకుంది. నిరుపేద కుటుంబానికి చెందిన శివాశికకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిస్తే దేశ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. తండ్రి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడని, తల్లి భవాని కాకతీయ యూనివర్సిటీ నుంచి క్రీడా రంగంలో మాస్టర్ డిగ్రీ చేసిందని పేర్కొన్నారు. స్పాన్సర్లు ముందుకు వస్తే శివాశిక ఉన్నత ప్రమాణాలతో కూడిన శిక్షణ తీసుకుంటుందని విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం, రాజేంద్రనగర్ మండల విద్యాధికారి డి.రామిరెడ్డి పేర్కొంటున్నారు.

'ఉద్యాన' విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఫస్టియర్ విద్యార్థులు క్షేత్రస్థాయి పంటల పరిశీలనలో భాగంగా శంషాబాద్‌లోని జీఎంఆర్ నర్సరీ, విమానాశ్రయంలో గల పూల గార్డెన్లను శనివారం సందర్శించారు. ఫ్లోరికల్చర్ కోర్సులోని అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కోర్సు ఇన్‌ఛార్జి అసిస్టెంట్ ప్రొఫెసర్ సీహెచ్ సంతోషిని విద్యార్థులకు పూల మొక్కల ల్యాండ్ స్కేపింగ్ విధానాలను వివరించారు. థియరీతో పాటు క్షేత్రస్థాయిలో ప్రాక్టికల్ నాలెడ్జ్ కూడా ఎంతో అవసరమన్నారు. విద్యార్థులకు పూల మొక్కల సాగులో మెళకువలు, అనుసరించాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో శ్రీనాథ్, జీఎంఆర్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

